# నువ్వు

"నువ్వు-నేను", "మనసంతా నువ్వే", "నీతో", "నువ్వు లేక నేను లేను", "నువ్వుంటే చాలు", "నువ్వు నాకు నచ్చావ్", "నువ్వే కావాలి", మొదలైన ఎన్నో సినిమాలు వస్తున్నా, నాకు ఈ మధ్య చదివిన ఒక "నువ్వు"ల వ్యాసం ఈ నువ్వుల సీరీస్‌లో నవ్వులు లేకుండా సీరియస్‌గావున్నా నాకు బాగా నచ్చింది. దాని గురించే చర్చిద్దాం ఇప్పుడు.

ఈ వ్యాసం వ్రాసంది ఎవరో కాదు ప్రఖ్యాత సైంటిస్ట్, భారత అంతరిక్ష విభాగానికీ, దేశ రక్షణకీ, ఎంతో కృషి చేసిన వ్యక్తి, కొన్నేళ్ళు త్రివేంద్రంలో ఆయనతో కలిసి పనిచేయటానికి నాకా అదృష్టం ఇచ్చిన మంచి ప్రాజెక్ట్ మేనేజరూ ఇప్పుడు భారత దేశానికి రాష్ట్రపతి శ్రీ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్. ఆయన ప్రెసిడెంట్ కాక ముందు హైదరాబాద్‌లో ఒక సభలో ఆయన ఇచ్చిన ఉపన్యాసమిది. ఇంటర్నెట్‌లో దేశదేశాలు తిరగటమే కాకుండా, కాస్తో కూస్తో బుర్ర వున్నవాళ్ళకీ, అది వున్నవాళ్ళల్లో కూడా ముఖ్యంగా దాన్ని ఉపయోగించే వాళ్ళకీ మెదడుకి మేత పెట్టే ఉపన్యాసం. మన రాజకీయ నాయకులు, వాళ్ళ గూండాలు, సన్యాసులు, మాఫియాలు, ఆయన్ని వాళ్ళ స్వార్థానికి నమిలి మింగేయకుండా వుంటే భారత దేశాన్ని ఆయన ఎంలో ముందుకి నడిపిస్తాడన్న ఆశ కలిగించే వ్యాసం. ఈ వ్యాసంలోని కొన్ని ముఖ్యమైన భాగాలని, మనం రోజూ కాఫీ తాగేటప్పుడూ తాగనప్పుడూ గాయత్రీ మంత్రంలా మననం చేసుకోవటం మనకీ భారత దేశానికీ కూడా మంచిదని నా ఉద్దేశ్యం. ఇక్కడ నువ్వు అంటే, నువ్వూ, నేనూ, మన మందరమూనూ అని. ఇక చదవండి.

నువ్వు మన గవర్నమెంట్ అసమర్థమైనదనీ దేనికీ పనికిరానిదనీ అంటావు. నువ్వు మన న్యాయవాద వ్యవస్థ చాల పురాతనమైనది అంటావు. నువ్వు మన మునిసిపాలిటీ ఇంటి ముందర చెత్తని అసలు తీయనే తీయదు అంటావు. నువ్వుమన ఫోన్లు సరిగ్గా పనిచేయవంటావు. రైళ్ళు ఒక జోక్ అంటావు. మన విమాన సర్వీస్ ప్రపంచంలోనే పరమచెత్తంటావు. ఉత్తరాలని దారిలోనే బట్వాసురుడు మింగేస్తాడంటావు. నువ్వు మన దేశాన్ని కుక్కలపాలు చేశారంటావు. దేశం ఒక రొమ్చు గుంటలో వుందంటావు. నువ్వు ఇంకా ఇలాగే చాల అంటుంటావు.

కానీ నువ్వేం చేస్తున్నావు?

సింగపూర్ వెళ్ళినప్పుడు అక్కడ ఎంతో చక్కగా హుందాగా ప్రవర్తిస్తావు. అక్కడ నువ్వు సిగరెట్ పీకలు రోడ్డు మీద పారెయ్యవుగాక పారెయ్యవు. షాపుల ముందర చిల్లర తిండ్లు తింటూ కూర్చోవు. వాళ్ళ భూగర్భ రైళ్ళని చూసి ఎంతగానో మెచ్చుకుంటావు.

నువ్వు దుబాయ్ వెడితే, రంజాన్ సమయంలో బయట ఏమీ తినటానికి

అక్కడ నీకు ధైర్యం చాలదు. నువ్వు జెడ్డాకి వెడితే, అక్కడ అందరితోపాటూ తల మీద జేబు రుమాల కట్టుకుంటావు. నువ్వు లండన్‌లో వుంటే, అక్కడ టెలిఫోన్ ఎక్స్చేంజ్‌లో ఎవడికో లంచం ఇచ్చి నీ ఫోన్ బిల్లు ఇంకోడి నెంబర్‌కి అంటగట్టవు. నువ్వు వాషింగ్టన్‌లో రోడ్డ మీద చాల స్పీడుగా వెడుతున్నప్పుడు నిన్ను పోలీసు పట్టుకుంటే, అతన్ని చూసి "నేనెవరో తెలుసా? మా బాబుతో చెబుతా" అని కాలరెగరెయ్యవు. నువ్వు ఆస్ట్రేలియాలోనో, న్యూజిలాండ్‌లోనో బీచ్ ఒడ్డునుంటే కొబ్బరి కాయ పీచుని, గార్బేజ్ డబ్బాలోనే తప్ప ఎక్కడపడితే అక్కడ పారేయవు. నువ్వు టోక్యోలో వుంటే, నీ కారా కిళ్ళీ ఉమ్మిని అక్కడ రోడ్ల మీద తుపుక్కున ఉమ్మేయవు. బాస్టన్‌లో వుంటే పరీక్షల్లో మార్కులు వేయించుకుని డిగ్రీలని కొనుక్కోవు.

మనమింకా నీ గురించే మాట్లాడుకుంటున్నాం.

నువ్వు విదేశాలకి వెడితే, అక్కడి కట్టుబాట్లనీ నియమాలనీ నిబంధనలనీ విధిగా పాటిస్తావు. అదే నువ్వు, నీ దేశంలో ఎందుకు పాటించవు? మాతృగడ్డపై కాలు మోపగానే ఎక్కడ పడితే అక్కడ కాగితాలు పారేస్తావు. సిగరెట్ పీకలు విసిరేస్తావు. ఇంకోచోట సరిగ్గా వున్నవాడివిక్కడ ఎందుకిలా అయిపోతున్నావ్?

ఎలక్షన్లలో ఓటు వేశాక అసలు గవర్నమెంట్ సంగతే మరిచిపోతావు. (ఆ ఓటు కూడా ఎంతమంది వేస్తున్నారు. వేసిన వాళ్ళల్లో ఎంతమంది న్యాయబద్ధంగా వేస్తున్నారు అన్నది ఒక ప్రశ్న) కుర్చీలో వెనక్కి ఆనుకుని కూర్చుని, ఇక ఆ గవర్నమెంటే అంతా చేయాలని అంటూ నువ్వు మాత్రం ఏమీ చేయకుండా నోటికి పని జెప్పి తిడుతూ కూర్చుంటావు.

గవర్నమెంట్ రోడ్లు శుభ్రం చేయటం లేదని అంటావు. అలా అంటూనే ఆ రోడ్ల మీద చెత్త నువ్వే పోస్తుంటావ్. మన రైళ్ళల్లో మరుగు దొడ్లు శుభ్రంగా లేవని తిడుతూనే వుంటావ్, అంటూనే వాటిని నువ్వే పాడు చేస్తుంటావ్. అలాగే విమానాల్లో కూడాను. ఇక్కడ నువ్వు అంటే ఆ సేవలని అందుకునే నువ్వూ నేనూ మనలాటివాళ్ళే అనికాదు, అవి చేయవలసిన సిబ్బంది వర్కర్ల దగ్గరనించీ ఆఫీసర్లతో సహా.

ఇలాటివే కాదు. మన సాంఘిక సమస్యల్లోకూడా ఇంతే. కట్నాలు చిన్న పిల్లల వివాహాలూలాటి స్త్రీల సమస్యలు చూద్దాం. సభలు పెట్టి, దేశం పాడయిపోయింది మాష్టారూ అని ఉపన్యాసాలిస్తాం. ఇంటికి వచ్చి ఆ కట్నాలేవో మనబాబయికి మనమే తీసుకుంటాం. "మొత్తం సంఘమంతా కుళ్ళిపోయింది. నేనొక్కడి నీ కట్నం తీసుకోకపోతే ఈ వ్యవస్థ మారుతుందా?" అని ఒక కుంటిసాకు చెబుతాం.

అయితే ఈ వ్యవస్థని మార్చేదెవరు? ఇంతకీ ఈ వ్యవస్థలో వున్నదెవరు. హాఁ! హాఁ! ఈ వ్యవస్థలోనా? మా పక్కింటివాళ్ళూ ఆ పక్కింటివాళ్ళూ. నగరాలూ. పట్టణాలూ. ప్రజలూ. ప్రభుత్వమూనూ. నేను మాత్రం కాదు.

కబుర్లు మానేసి అసలు పనులు చేయవలసిన సందర్భం వచ్చినప్పుడు మాత్రం, మన గూడులోకి మనం -మనవాళ్ళతో సహా వెళ్ళిపోయి, ఎవరో ఎక్కడి నించో ఊడిపడతాడనీ, మనల్ని ఉద్ధరిస్తాడనీ ఆశ పెట్టుకుని ఎదురు చూస్తాంగానీ, అంతకన్నా ఏమీ చేయం. అలా కాకపోతే మన దేశం వదిలి ఇంకో దేశానికి పారిపో

తాం. ఏ అమెరికాకో పారిపోయి, అక్కడ నిబంధనలని పాటిస్తూ బ్రతుకుతుంటాం. న్యూయార్క్‌లో బ్రతకటానికి కష్టమయితే లండన్‌కి వెడతాం.అక్కడా నిరుద్యోగం పెరిగిపోతే, వెంటనే గల్ఫ్‌దేశాలకి పోతాం. అక్కడ కూడా ఏ యుద్ధమో వస్తే, మన గవర్నమెంట్ మనల్ని రక్షించి ఇండియాకి తీసుకురావటంలేదని గొడవ చేస్తాం.

ప్రతివాడికీ తిట్టటానికే దేశం వుంది. ఇలా మానభంగం చేయటానికే దేశం వుంది. దేశం కోసం మనమేదన్నా చేయాలి అన్న ఆలోచన ఎవరికీ లేదు. మనం, మన ఆలోచనలూ, మన అంతరాత్మా అన్నీ డబ్బుతోనే ముడిపడివున్నాయి మరి.

ఈ సందర్భంలో జె.ఎఫ్. కెన్నెడీ చెప్పిన మాటలు, ఇండియాకి అన్వయించుకోవటం చాల అవసరం. ఆయన "నీ దేశం నీకేమిచ్చింది అని కాదు అడగవలసింది. నీ దేశానికి నువ్వేం ఇచ్చావు అని" అన్నాడు.

దాన్నే కలాంగారి మాటల్లో "ఇండియాకి నువ్వేం చేయగలవు అని నిన్ను నువ్వే అడుగు! అమెరికా తదితర పడమటి దేశాలలాగా ఇండియా తయారవాలంటే, ముందుకు పోవాలంటే నేనేం చేయాలి? అని ప్రశ్నించుకో!"

కలాం పెట్టినవి చివాట్లు అనాలో, ఇచ్చిన మేల్కొలుపు అనాలో కానీ, అది ఒక్క సామాన్య ప్రజలకి మాత్రమే ఉద్దేశించింది కాదు. మన వార్తా పత్రికలూ, టీవీ రేడియోల గురించి కూడాను. ఎందుకు మన మీడియా, మన దేశమంటే అంత వ్యతిరేకంగా వుంటుంది అని ఆయన మండి పడ్డారు. ప్రొద్దున్నే లేచిన దగ్గరనించీ, ఎంత మంది ప్రమాదాల్లోచనిపోయారు, చంపబడ్డారు, ఎన్ని నేరాలు, తీవ్రవాదాలూ, దుర్మార్గాలూ. ఇంతకన్నా చెప్పవలసినవేమీ లేవా? దేశం నలుమూలలా ఎన్నో గొప్ప విశేషాలు జరుగుతున్నాయే, వాటి గురించి ఏమీ చెప్పరేం? పాల ఉత్పత్తిలో మనం ముందున్నాం. రిమోట్ సెన్సింగ్ శాటిలైట్లలో మనం ప్రథమ స్థానంలో వున్నాం. గోధుమ ఉత్పత్తిలో రెండవ స్థానంలో వున్నాం. బియ్యం పంటలో రెండవ స్థానంలో వున్నాం. ఇలాటి చెప్పుకోదగ్గ విషయాలు వేలకి వేలున్నాయి. మరి వాటి గురించి మన మీడియా మాట్లాడదేం? అంటారు.

ఈ ఉపన్యాసం ఇచ్చి ఇప్పటికే చాల నెలలయింది. అప్పుడు ఆయన్ని రాష్ట్రపతిగా చేయాలన్న ఆలోచనకూడా ఎవరికీలేదని అంటున్నారు. ఇంత ముందు చూపు కనపరిచి, ఆవేదనతో మాట్లాడిన ఆయన మాటలు, ఇంటర్నెట్‌లో ఇంకా దశదిశలా ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. ఆయన ఉపన్యాసం ఈ మధ్యనే తూర్పు ఆఫ్రికానించి, భారతీయుడు కాని ఒకతను పంపించాడంటే, ఈ వ్యాసం ఎంతమందిని ఎలా స్పందింపజేస్తున్నదో అర్థమవుతున్నది.

అందుకే అంటున్నాను ఇది అందరూ విధిగా చదవవలసిన వ్యాసం అని. అందుకే తెలుగులో ఎన్నారై కబుర్లలో చెప్పటం నా బాధ్యత అని ఇది ఇలా చెబుతున్నాను "నువ్వు" ఇది చదివి, నలుగురి చేతా చదివించు.

వాళ్ళ చేత కొంచెమయినా ఆలోచింపజేయగలిగితే నీకూ నాకూ మనందరికీ, ముఖ్యంగా భారతదేశానికి మంచిది

* * *